ఈనాడు
నాగర్‌కర్నూల్
శుక్రవారం అక్టోబరు 18, 2024 5

తెగుతున్న కాల్వలు

మరమ్మతులు లేక బలహీనంగా కట్టలు


అచ్చంపేట మండలం పులిజాల సమీపంలో తెగిన కాల్వను పరిశీలిస్తున్న డీఈ మాణిక్‌ప్రభు (పాతచిత్రం)

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో సాగు నీటి కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ముళ్ల చెట్లు, జమ్ము గడ్డి పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా నిలుస్తున్నాయి. చెట్లు పెరగడంతో కట్టలు బలహీనంగా మారి చిన్న ప్రవాహానికే తెగుతున్నాయి. నిర్వహణ నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేయడంలేదని అధికారులు చెబుతున్నారు. గండ్లు పడిన చోట మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నామని అంటున్నారు.

జిల్లాలో జలాశయాలు... : కొల్లాపూర్ సమీపంలో ఎల్లూరు, సింగోటం, పెద్దకొత్తపల్లి మండలంలో జొన్నలబోగుడ, నాగర్‌కర్నూల్ మండలంలో గుడిపల్లి జలాశయాలు ఉన్నాయి. వీటి ద్వారా దిగువన ఉన్న తెల్కపల్లి, లింగాల, బల్మూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, కల్వకుర్తి, వంగూరు మండలాలకు సాగునీరందిస్తున్నారు. గుడిపల్లి జలాశయం నుంచి అచ్చంపేట మండలంలోని పులిజాల వరకు 80 కిలోమీటర్ల మేర కేఎల్‌ఐ కాల్వ ఉంది. మరో 15 కి.మీ పొడిగించి ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల చివరి ఆయకట్టుకు నీరందించేందుకు పనులు చేపట్టారు. ఇక్కడ మూడు కి.మీ మేర పనులు చేయాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.


గట్టుతుమ్మెన్ గేటు సమీపంలో కేఎల్‌ఐ కాల్వలో చెట్లు

తరచూ గండ్లు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేఎల్‌ఐ కాల్వల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద, వెంకటాపూర్, అచ్చంపేట మండలం పులిజాల, లింగోటం, బల్మూర్ మండలం చెన్నారం, కోడేర్ మండలం మైలారం, నర్సాయపల్లి, ఎత్తం గ్రామ శివారుల్లోని పంట (డిస్ట్రిబ్యూటరీ) కాల్వలు తరచూ తెగుతున్నాయి. వెల్దండ సమీపంలో కేఎల్‌ఐ డి-82 కాల్వకు పలు సార్లు గండ్లు పడగా... అధికారులు నామమాత్రపు చర్యలు చేపట్టినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నిర్వహణను చూసి చూడనట్లు వ్యవహరించడంతో కాల్వల్లో ముళ్ల పొదలు, చెట్లు పెరిగాయి. ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలి. కానీ గతంలో కాల్వ పనులను చేసిన గుత్తేదారు సహకారంతో తెగిన చోట మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు.

పూడ్చి వేస్తున్నాం...

గండ్లు పడిన చోట ఎప్పటికప్పుడు పూడ్చివేస్తున్నాం. మరమ్మతులకు ఎలాంటి నిర్వహణ నిధులు లేకపోవడంతో గుత్తేదారు సహకారంతోనే గండ్లు పడిన చోట మట్టి పోయిస్తున్నాం. ముళ్లపొదలు, చెట్ల తొలగింపు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాల్వ కోసం పులిజాల నుంచి పెనిమిళ్ల వరకు భూములిచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందిన వెంటనే పనులను వేగవంతం చేస్తాం.

- మాణిక్‌ప్రభు, కేఎల్‌ఐ డీఈ, నాగర్‌కర్నూలు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

కందనూలు: పట్టణంలోని ఆలన (పాలియేటివ్ కేర్) కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.స్వరాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం ఆలన కేంద్రంలో ప్రపంచ పాలియేటివ్ కేర్ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రాణాంతక వ్యాధులకు గురై అవసాన దశలో బాధపడుతున్న వారికి ఆలన కేంద్రంలో సేవలు అందిస్తామని పేర్కొన్నారు. రోగులకు పండ్లు అందజేశారు. జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.రఘు, జిల్లా ఉపవైద్యాధికారి డా.వెంకట్‌దాస్, ప్రోగ్రాం అధికారులు డా.కృష్ణ, డా.శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ కార్యదర్శి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగని తవ్వకాలు

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా క్వారీల్లో అక్రమాలు

ఈనాడు, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మైనింగ్ అక్రమాలపై ఇటీవల వచ్చిన ఫిర్యాదులు, విచారణలు చర్చనీయాశంగా మారాయి. గతంలో ఇక్కడ పని చేసిన ఆ శాఖ ఏడీ సస్పెన్షన్‌కు గురి కావడం, జడ్చర్ల సమీపంలోని శంకరాయపల్లిలో తవ్వకాలపై ఉన్నతాధికారుల విచారణతో మరోసారి గనుల అక్రమాలు తెర పైకి వచ్చాయి. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో మైనింగ్ వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా పట్టించుకొనే నాథుడే కరవయ్యారు. అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వుతూ కొందరు నిర్వాహకులు రూ.కోట్లు దండుకొంటున్నారు. వీరికి కొందరు అధికారులు సహకరిస్తుండటంతో అక్రమాలకు అడ్డే లేకుండాపోతోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 285 క్వారీలకు అనుమతులిచ్చారు. వీటిలో క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, స్టోన్ అండ్ మెటల్, కలర్ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, మొరం వంటి వాటికి మైనింగ్ శాఖ అనుమతులిచ్చింది. పలు క్వారీల్లో అనుమతులు తీసుకున్న దాని కంటే అధికంగా గుట్టలను తవ్వేస్తున్నారు. టన్ను రాయికి రూ.80, మొరం మట్టికి రూ.35 రాయల్టీ చెల్లించాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ సీఎం సొంత జిల్లాలోనే ఈ అక్రమాలు ఆగడం లేదు.


జడ్చర్లలోని శంకరాయపల్లి గుట్టలోని క్వారీ

సర్వే పేరుతో కాలయాపన..: పాలమూరులో ఎక్కువశాతం మైనింగ్ పేరుతో అక్రమంగా క్వారీలు తవ్వి అక్రమంగా తరలిస్తున్నారో ఆ శాఖకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కొన్ని చోట్ల మైనింగ్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది ఎక్కడ అక్రమాలు జరుగుతాయో అక్కడ వాలిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయినా అక్రమార్కులపై చర్యలు మాత్రం ఉండవు. ఎక్కువ ఆరోపణలొస్తే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నామని అక్రమాలు అందులో వెల్లడవుతాయని చెప్పి తప్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మైనింగ్ శాఖకు చెందిన పలువురు అధికారులు గత పదేళ్లుగా డీజీపీఎస్ సర్వే పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

మచ్చుకు కొన్ని

- మహబూబ్‌నగర్ జిల్లా శంకరాయపల్లిలో మూడు క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. దేవరకద్ర నుంచి కోయిల్‌సాగర్ వెళ్లే దారిలోనూ ఓ గుట్టను క్వారీ అనుమతుల పేరుతో కొల్లగొట్టారు. మిడ్జిల్ మండలం లింబ్యాతండాల్లోనూ కొందరు వ్యక్తులు పోటీ పడి మైనింగ్ ద్వారా రూ.లక్షలు సంపాదించుకున్నట్లు ఆరోపణలున్నాయి. భూత్పూర్ మండలంలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. బాలానగర్, మిడ్జిల్ మండలాల్లో పలుగురాళ్ల పేరుతో యథేచ్ఛగా దోపిడీ సాగుతోంది.
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు ప్రధాన నేతలకు క్వారీలున్నాయి. ఇక్కడ నిబంధనల్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. రూ.కోట్లలో రాయల్టీని ఎగ్గొడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- వనపర్తి జిల్లా కొత్తకోట, పెద్దమందడి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో క్వారీల నుంచి ఇష్టారాజ్యంగా పలుకు తీసి ఇక్కడే క్రషర్ యంత్రాల ద్వారా కంకరగా మార్చి విక్రయిస్తున్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని పలుగురాళ్ల పేరుతో తీసుకున్న మైనింగ్ అనుమతులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. దీనిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొల్లాపూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, తాడూరులోనూ గుట్టలను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి వ్యాపారం చేస్తున్నారు.
- నారాయణపేట జిల్లాలో రాయచూర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని పలు చోట్ల మైనింగ్ వ్యాపారం నడుస్తోంది. ఇక్కడ పూర్తిగా నిబంధనలను పక్కన పెట్టి వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.
- పాలమూరులో ఏ పల్లెకు వెళ్లినా మొరం కోసం యథేచ్ఛగా తవ్విన మట్టి గుట్టలే కనిపిస్తాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.లక్షల్లో సంపాదన ఉండటంతో చాలామంది గ్రామాల్లో ఉన్న మట్టిగుట్టలను తవ్వి వ్యాపారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల పేరుతోనూ ఇష్టారాజ్యంగా మొరం మట్టి కోసం గుట్టలను మాయం చేస్తున్నారు.

సమాజంలో విలువలు పెంచేవి గ్రంథాలయాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : సాంకేతికత పెరిగిన నేపథ్యంలో సమాజంలో విలువలు, సంస్కృతిని, ధైర్యాన్ని పెంచేవి గ్రంథాలయాలేనని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో వనపర్తి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా గోవర్ధన్‌సాగర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే మేఘారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నాణ్యత, విలువలతో కూడిన విద్య లేక విద్యార్థులు చిన్నచిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. జిల్లాలోని ప్రతి మండలంలో గ్రంథాలయాలను మంచి వాతావరణంలో ప్రారంభించి విరివిగా చర్యలు తీసుకోవాలని అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. నల్లచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బోటు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా వెంటనే మంజూరు చేశారన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్‌తో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి, వనపర్తి ఎమ్మెల్యేతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పలువురునాయకులు, కార్యకర్తలు గోవర్ధన్‌సాగర్‌ను సన్మానించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి మల్లేశ్, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పురపాలిక ఉపాధ్యక్షుడు పాకనాటి కృష్ణయ్య, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన ఎమ్మెల్యే మేఘారెడ్డి, రియాజ్

భారాస పాలనలో రాష్ట్రం అప్పులపాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: భారాస నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఆయన వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల వడ్డీ చెల్లిస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. దీపావళి నాటికి రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఆక్రమణల బారిన పడ్డ చెరువులను పునరుద్ధరిస్తుంటే విమర్శిస్తున్నారు. వనపర్తి జిల్లాలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి భారాస నాయకులు కబ్జా చేశారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని భారాస నాయకులకు సవాల్ విసిరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అలీబాబా అరడజను దొంగల మాదిరిగా భారాస నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు.

స్థిరాస్తి వ్యాపారానికి కుంట పూడ్చివేత

గత ప్రభుత్వ పెద్దల సహకారంతో మాస్టర్ ప్లాన్‌లోనూ తొలగింపు

వెంచర్ ఏర్పాటుకు అనుమతి నిరాకరించిన జిల్లా ఉన్నతాధికారి

నిఘా

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలక: మహబూబ్‌నగర్ పట్టణం నడిబొడ్డున దేవుని పేరిట ఏర్పాటైన కాలనీ ఉన్నత వర్గాల నివాసముండే ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేయాలనుకున్న వెంచర్‌కు జిల్లా ఉన్నతాధికారి అనుమతి నిరాకరించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్ల విలువైన భూమిలో వెంచర్ ఏర్పాటుకు అనుమతులు దక్కకపోవడంతో స్థిరాస్తి వ్యాపారులు రాజకీయంగా పురపాలిక యంత్రాంగంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెంచుతున్నారు. వెంచర్ ఏర్పాటుకు అనుమతులు నిరాకరించడంతో ఉన్నతాధికారి వద్దకు ఏ దస్త్రాలతో వెళ్లి అనుమతులు వచ్చేలా చేయాలో అర్థం కాక మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారి వెంచర్ ఏర్పాటుకు ఎందుకు అనుమతులు నిరాకరించారో తెలిస్తే ఒకింత ఆశ్చర్యం కలగక మానదు.

కనుమరుగు చేశారిలా..: కాలనీ ఏర్పాటుకు ముందు ఓ రెవెన్యూ గ్రామ పరిధి ప్రైవేటు పట్టా భూమిలో నీటి కుంట ఉండేది. ఆ గ్రామం పురపాలికలో విలీనమయ్యాక అర్బన్ మండలం పరిధిలోకి వచ్చింది. కుంటను 2010 మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ జోన్‌గా నిర్ధారించగా ఆ పట్టా భూమిని జప్తులోకి తీసుకున్నారు. వారు తమ ఆలోచనను పదును పెట్టారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేత సహకారంతో కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి 2022లో తొలగించుకోగలిగారు. ఆ భూమిని స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. కుంటను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు ఐదు నెలల క్రితం రాత్రికి రాత్రే పొక్లెయినుతో పూడ్చేసి చదును చేసే ప్రయత్నం చేశారు. అప్పట్లో టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా స్థిరాస్తి వ్యాపారులు మాస్టర్ ప్లాన్‌లో కుంట తీసేసిన దస్త్రాలు, గెజిట్ నోటిఫికేషన్ పత్రాలు చూపించి వెనక్కి పంపించేశారు. ఇటీవల కుంట స్థలాన్ని చదును చేసి భారీ వెంచర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్న స్థిరాస్తి వ్యాపారులు టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా జిల్లా ఉన్నతాధికారి అనుమతి కోసం వారం క్రితం దస్త్రం పంపించారు. దస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారి కుంటను పూడ్చేసి వెంచర్ ఏర్పాటు చేయడమేంటంటూ అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఉన్నతాధికారి అనుమతి నిరాకరించడంతో అటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇటు స్థిరాస్తి వ్యాపారులు కంగుతిన్నారు. ఎలాగైనా జిల్లా ఉన్నతాధికారి అనుమతి పొందాలన్న పట్టుదలతో స్థిరాస్తి వ్యాపారులు సంబంధించిన ఓ సర్వేయర్ పురపాలిక కమిషనర్‌పై తీవ్ర స్థాయిలో మంత్రాంగం నడుపుతున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారి నీటి వనరుగా ఉన్న కుంటలో స్థిరాస్తి వ్యాపారానికి అనుమతులు ఇస్తారా లేక కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి ఎందుకు తొలగించారని సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.

నిర్లక్ష్యం వహించే మిల్లులపై కఠిన చర్యలు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: నిర్లక్ష్యం వహించే రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ హెచ్చరించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన మిల్లింగ్ రైస్‌ను ఈనెల 31లోపు అందించాలని ఆదేశించారు. 31లోపు సీఎంఆర్ బియ్యం అందించని మిల్లులపై చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్లతో తనిఖీలు చేయించి బ్లాక్ లిస్ట్‌లో పెడతామన్నారు. 2023 ఖరీఫ్‌కు సంబంధించి 20360 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించాల్సి ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్, డీఎం రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించండి

కందనూలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మండలంలోని వెంకటాపూర్, మంతటి ప్రాథమిక పాఠశాలలను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలకరించి పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు ఇచ్చారా.. అని అడిగారు. విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు పాఠశాలకు వస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సెలవు పెట్టకుండా పాఠశాలకు గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. డీఈవో గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు 42 మంది ఏఎస్సైల ఎంపిక


మహబూబ్‌నగర్: పరేడ్ మైదానంలో సాధన చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో 42 మంది ఏఎస్సైలు ఎస్సై శిక్షణకు ఎంపికయ్యారు. వారికి ఈ నెల 22 నుంచి 12 వారాల పాటు హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి పోలీస్ అకాడమిలో శిక్షణకు ఇస్తారు. ఇందుకు జోగులాంబ జోన్ డీఐజీ ఎస్ఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 16 మంది, మహబూబ్‌నగర్ నుంచి 10, వనపర్తి నుంచి 09, జోగులాంబ గద్వాల నుంచి ఐదుగురు, నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు. 1986, 1987, 1989 కానిస్టేబుల్ బ్యాచ్‌లకు చెందిన వారిలో ప్రస్తుతం ఏఎస్సైగా పనిచేస్తున్న వారికి శిక్షణ ఇవ్వనున్నారు. వారంతా 2021లో నిర్వహించిన శాఖాపరమైన రాత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 21న వారంతా హైదరాబాద్‌లో రిపోర్టు చేయనున్నారు. శిక్షణ తర్వాత అన్ని విభాగాల్లో ఉత్తీర్ణత సాధిస్తే వారిని ఖాళీలు ఉన్న పోలీస్ స్టేషన్లలో ఎస్సైలుగా నియమిస్తారు. ఖాళీలు లేకపోతే వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్టేషన్లలోనే ఏఎస్సైలుగా కొనసాగుతారు. జోగులాంబ జోన్ పరిధిలో ఎస్సై పోస్టులు ఖాళీగా ఏర్పడితే ఆ ఏఎస్సైలకు పదోన్నతి కల్పించి నియమిస్తారు.

రిజర్వులో మరో ఐదుగురు సిద్ధం : ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సివిల్ ఏఎస్సైలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారిలో శిక్షణకు వెళ్లడానికి ఇష్టం లేకపోయినా, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నా, వారి స్థానాల్లో తర్వాత సీనియారిటీ జాబితాలో ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు. ఇందుకు మరో ఐదుగురి పేర్లతో జాబితా సిద్ధం చేశారు. ఎస్సై నిర్వర్తించే అన్ని రకాల విధులపై శిక్షణ పొందుతారని పోలీసు శాఖ వర్గాలు తెలిపాయి.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.204 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి గత ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు 2018లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంజీకేఎల్ఐలో భాగంగా నిర్మించిన డీ82 భూ నిర్వాసితులకు రూ.18కోట్ల పరిహారం అందించామన్నారు. కొత్త గేట్ నుంచి రాచూర్‌తండాకు రూ.2.25కోట్లు, మార్చాల రోడ్డు నుంచి యంగంపల్లికి రూ.5కోట్లు, మాడ్గుల మండలంలో సీసీ దారులు, భూగర్భ మురుగుకాల్వల నిర్మాణానికి రూ.7.5కోట్లు, కొత్త తండా నుంచి కల్వకుర్తి పట్టణానికి నాలుగు వరుసల దారికి రూ.30కోట్లు, వెల్దండ నుంచి సిర్సనగండ్ల వరకు రూ.40కోట్లు, జూపల్లి నుంచి వంగూర్ గేట్ వరకు రూ.9కోట్లు, కోనాపూర్ నుంచి మాడ్గుల్ రూ.45కోట్లు, అమనగల్లు నుంచి ఇర్విన్ రూ.30కోట్లు, కొత్త తండా నుంచి కడ్తాల్ రూ.35కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు బాలాజీసింగ్, ఆర్‌అండ్‌బీ డీఈ నాగమణి, నాయకులు ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, షాన్‌వాజ్‌ఖాన్, రాంరెడ్డి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యానికి బోనస్ ఎలా ఇస్తారంటే...

బోనస్... బోనస్.. వరిరైతు నోట ఈ సారి ఇదే మాట..
సన్నాలకే వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నా, అవి ఏమిటనేది రైతుల్లో సందేహం ఉంది.
ఏ రకం ధాన్యానికి ఇస్తారు. ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం.

న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వర్షాకాలం వరి ధాన్యం సేకరణకు పౌరసరఫరాల, సహకార, ఐకేపీ, మార్కెట్ కమిటీ అధికారులు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సారి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి రూ. 5 వందలు బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టింది.

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ వర్షాకాలంలో వరి సాధారణ విస్తీర్ణానికి మించి సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 6,35,144 ఎకరాలు కాగా ఈ సారి 7,64,914 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 1,29,770 ఎకరాల్లో అదనంగా సాగు అయ్యింది. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడంతో విస్తీర్ణం తగ్గవచ్చని భావించారు. ముగింపులో మంచి వర్షాలు పడటంతో వ్యవసాయ బోర్లు రీఛార్జి కావడం, కుంటలు, చెరువులు నిండటంతో పుష్కలంగా సాగయ్యింది. బోనస్ వస్తుందనే నమ్మకంతో సాగు పెంచారని భావిస్తున్నారు.




రాంకిష్టాయపల్లి శివారులో సాగు చేసిన వరి

వీటికే ప్రోత్సాహకం

బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సన్నాల్లోని 33 రకాలకు వర్తింపజేశారు. ధాన్యం గింజ పొడవు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనేది తెలుసుకోవడానికి ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఈ సారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. ధాన్యం తేమ 17 శాతానికి మించనప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని నిర్దేశించారు.

వర్తించే రకాలు

సిద్ధి(డబ్ల్యుజీఎల్44)	జగిత్యాల్ మసూరి (జేజీఎల్11470)	రాజేంద్రనగర్ వరి - 4 (ఆర్ఎన్ఆర్ 21278)	సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)	పొలాస ప్రభ (జేజీఎల్ 384)	కూనరం వరి- 1 (కేఎన్ఎం 733)	శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
సాంబ మసూరి (బీపీటీ 5204)	కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)	జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)	సోమ్‌నాథ్ (డబ్ల్యుజీఎల్ 347)
జగిత్యాల్ వరి- 3(జేజీఎల్ 27356)	మానేరు సోనా (జేజీల్ 3828)	జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)	ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్ఏ)
జగిత్యాల్ వరి- 2(జేజీఎల్ 28545)	తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)	కరీంనగర్ సాంబ (.జేజీఎల్ 3855)	కేపీఎస్ 6251 (పీఆర్ఏ)
వరంగల్ సాంబ(డబ్ల్యుజీఎల్ 14)	వరంగల్ వరి - 1119	అంజన (జేజీఎల్ 11118)	జేజీఎల్ 33124 (పీఆర్ఏ)
వరంగల్ సన్నాలు (డబ్ల్యుజీఎల్32100)	కూనరం వరి- 2 (కేఎన్ఎం 1638	నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)	హెచ్ఎంటీ సోనా
	వరంగల్ వరి- 2 (డబ్ల్యుజీఎల్ 962)	ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)	మార్టేరు సాంబ (ఎంటీయూ 1224)
	ఎంటీయూ 1271		మార్టేరు మసూరి (ఎంటీయూ 1262)

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితిలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించి ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ జిల్లా ప్రజలకు సూచించారు. మండలంలోని అప్పాజిపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. కెమెరాల ఏర్పాటుతో నేరాలు, దొంగతనాలకు చెక్‌పెట్టవచ్చునని, అసలైన నేరం చేసిన వాళ్లకు శిక్షపడేట్టు చేయవచ్చునన్నారు. కెమెరాలతో రాష్ట్రంలోనే కాక దేశంలో ఎన్నో పెద్దపెద్ద కేసులు బయటపడ్డాయన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలుంటే పోలీసుల సహకారంతో అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని అందుకు మా శాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోయే సూచనలు కనిపిస్తున్నాయని ఆ సమయంలో కెమెరాలు అత్యంత కీలకమవుతాయని అన్నారు. అంతకు ముందు గ్రామ సమీప కొండపై కొలువైన అప్పాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిమ్మాజిపేట ఠాణాను పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్య, ఎస్సై నరేందర్‌రెడ్డి, గ్రామ నాయకులు రాందేవ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపతమ్మ, రాంచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, రవి పాల్గొన్నారు.



నువ్వులు విరిశాయి!



విరబూసిన పూలతో నువ్వుల పంట కనువిందు చేస్తోంది. భూత్పూర్ మండలం గోప్లాపూర్ శివారులో ఓ రైతు నువ్వుల పంట సాగుచేశారు. ప్రస్తుతం ఆ పంట పూత దశలో ఉంది. లేత గులాబీ వర్ణంలో విరిసిన పూలతో అక్కడేదో పూలతోట ఉన్నట్లుగా కనిపిస్తోంది. పూలలోని మకరందాన్ని గ్రోలుతూ తేనెటీగలు సందడి చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్న ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది. - ఈనాడు, మహబూబ్‌నగర్

బడికెళ్లాలంటే ఎన్ని కష్టాలో!



శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వడ్డేపల్లి మండలం కోయిదిన్నె నుంచి 6 కి.మీ. ప్రయాణించి 20 మంది, మానవపాడు మండలం మద్దూరు నుంచి 12 కి.మీ ప్రయాణించి 40 మందికి పైగా విద్యార్థులు వస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరంతా ప్రైవేటు వాహనాలు, సైకిళ్లపై వస్తున్నారు. ఇలా ప్రతి నెలా వీరు రూ.600 - 900 వరకు రవాణా కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది.

రవాణా భత్యమూ చెల్లించని ప్రభుత్వం | **గ్రామాలకు నిలిచిన ఆర్టీసీ బస్సులు**

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్, అయిజ

బడికెళ్లడానికి విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందలాది గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతూ ప్రమాదకర ప్రయాణాలు చేస్తూ పాఠశాలలకు చేరుకుంటున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం గతంలో రవాణా భత్యం అందించేది. ప్రస్తుతం విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా.. నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. కొన్ని గ్రామాల్లో తల్లిదండ్రులు ఏకంగా పిల్లలను బడి మాన్పించేస్తున్న పరిస్థితి ఉంది.

ఐదు వేలకుపైగా: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో 3.20 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో దాదాపు నాలుగు వందలకుపైగా పాఠశాలలు విద్యార్థులకు దూరంగా ఉంటున్నాయి. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కిలోమీటరు దూరం వెళ్తుంటే.. 1 - 5వ తరగతి వారికి నెలకు రూ.400 చొప్పున, 3 కి.మీ. దూరం నుంచి వస్తున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.600 చొప్పున చెల్లించేవారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మందికి ఈ భత్యం చెల్లించాల్సి ఉంది. ఏటా విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు.

ఇవిగో కొన్ని..

- వనపర్తి జిల్లా అమరచింత ఉన్నత పాఠశాలకు 6 కిలోమీటర్ల దూరంలో ధర్మాపురం నుంచి 10 మంది కిపైగా విద్యార్థులు వస్తుంటారు. మూడు కి.మీ. దూరంలోని చంద్రానాయక్‌తాండా నుంచి 20 మందికి పైగా వస్తుంటారు. ఈ రెండు గ్రామాలకు బస్సు లేదు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే. ఆరు కి.మీ. దూరంలోని కొంకలవానిపల్లె నుంచి 30 మందికిపైగా విద్యార్థులు వస్తుంటారు.
- రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామం నుంచి 5 కి.మీ. దూరంలోని పెద్దతాండ్రపాడుకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. ఆడపిల్లలను సైకిళ్లపై పంపలేక పది మందికి పైగా బాలికలను వారి తల్లిదండ్రులు బడి మాన్పించారు.
- గద్వాల జిల్లా రాజోలి, అయిజ, వడ్డేపల్లి, ఉండవల్లి, మల్దకల్ మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సైకిళ్లపై వస్తూ కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ.. ప్రతి రోజూ రూ.30 - రూ.50 పైగా ఖర్చు చేస్తున్నారు.



ఊట్కూరు: కాలినడకన మక్తల్ ఉన్నత పాఠశాలకు నడచివెళుతున్న ఊట్కూరు మండలం పెద్దపొర్ల విద్యార్థులు వీరు. సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి స్టేజీ వరకువెళ్లి అక్కడ నుంచి 12 కి.మీ. దూరంలోని మక్తల్‌కు బస్సుపై చేరుకుంటారు. రోజూ సుమారు 50 మంది విద్యార్థులు ఇలా వెళుతుంటారు. గ్రామానికి తారురోడ్డున్నా బస్సు సౌకర్యం మాత్రం లేదు.

రవాణా భత్యం అందించాలి



నేను, నాతో పాటు మరో 30 మంది కలిసి మా గ్రామం నుంచి చదువుకోవడానికి 12 కి.మీ. దూరంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నాం. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాన్ని మాట్లాడుకొని వస్తున్నాం. మా లాంటి వారి కోసం ప్రభుత్వం రవాణా భత్యం ఇస్తారని సార్లోళ్లు చెప్పారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి. -ఆనంద్, 8వ తరగతి, తుమ్మిళ్ల

ఉన్నతాధికారులకు తెలిపాం

విద్యార్థులకు రవాణా భత్యం అందించడానికి ఏటా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు నివేదిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. అయితే.. గతేడాది కొందరు విద్యార్థుల ఖాతాల్లో ఒక ఏడాదికి సంబంధించి డబ్బులు పడినట్లుగా చెప్పారు. మాకు మాత్రం అధికారికంగా రాలేదు. మరోసారి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.

-శాంతిరాజు, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల



జడ్చర్ల న్యూటౌన్: మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు వీరు. వల్లభరావుపల్లి, లింబ్యాతండా, దోనూరు, కంచెనపల్లి తదితర గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థులు నిత్యం నాలుగు కిలోమీటర్ల దూరం ఇలా నడిచి, లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే.

అండర్-14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న పాల్గొన్నారు.

19న బిజినేపల్లిలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను ఈనెల 19న బిజినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఖోఖో సంఘం కార్యదర్శి విలియం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్, బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు మైదానంలో నివేదించాలని కోరారు. వివరాలకు 95531 24166, 94934 50450 నంబర్లలో సంప్రదించాలన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో జూనియర్స్ టోర్నీ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోకి నేడు సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు



మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా టోర్నీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 3న ఎల్బీ స్టేడియంలో 10 కి.మీ.ల సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు పందెం నిర్వహించింది. ఇదే రోజు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో సీఎం కప్ క్రీడాజ్యోతి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఇది రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల మీదుగా ఈనెల 21 వరకు 33 జిల్లాల్లో 2,830 కి.మీ.ల సాగుతుంది. ఈ వాహన ర్యాలీ ఈనెల 18న ఉమ్మడి జిల్లాలో ప్రవేశిస్తుంది. అయిదు జిల్లాల్లో ఈ నెల 20 వరకు కొనసాగుతుంది. జిల్లాల యువజన క్రీడల అధికారులు, క్రీడా సంఘాలు క్రీడాజ్యోతి వాహన ర్యాలీని జయప్రదం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాల వారీగా 10కే రన్ : ఈ నెల 18న ఉదయం నాగర్‌కర్నూల్‌లోని కొత్త కలెక్టరేట్ నుంచి లిటిల్ ఫ్లవర్ పాఠశాల వరకు 10 కి.మీ.ల పరుగు పందెం కొనసాగనుంది. ఇదే రోజు సాయంత్రం వనపర్తి జిల్లాలోని చిట్యాల నుంచి కలెక్టరేట్ వరకు పరుగు నిర్వహిస్తారు. ఈనెల 19న ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు సంగాల పార్కు నుంచి గద్వాలలోని కలెక్టరేట్ వరకు, ఇదే రోజు సాయంత్రం నారాయణపేట జిల్లాలో తిప్రాస్‌పల్లి నుంచి పట్టణంలోని నర్సిరెడ్డి చౌరస్తా వరకు పరుగు కొనసాగుతుంది. ఈ నెల 20న మహబూబ్‌నగర్‌లో క్రీడాజ్యోతి పరుగు డీఎస్ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ వరకు నిర్వహిస్తారు. యువజన, క్రీడల శాఖ సిబ్బంది, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొంటారు.

ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు

నల్గొండ నుంచి వచ్చే వాహన ర్యాలీ ఈనెల 18న చారకొండలో ప్రవేశిస్తుంది. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొడంగల్, సవాయిగూడెం, పెబ్బేరు, ఎర్రవల్లి, జమ్మిచేడు మీదుగా చిట్యాలకు చేరుతుంది. 19న వనపర్తి కలెక్టరేట్, ఆత్మకూరు, జక్లేర్ ధన్వాడ, జాజాపూర్, మరికల్, బండ్రవల్లి, తిప్రాస్‌పల్లిలో, 20న నారాయణపేట, దేవరకద్ర, ధర్మాపూర్, హన్వాడ, పరిగి, కడ్తాల్, మహేశ్వరం, పెద్దఅంబర్‌పేట, తిమ్మాయిపల్లి మీదుగా మంకాల్‌కు చేరుకుంటుంది. ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు ర్యాలీ సాగుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్ చెప్పారు.

కురుమూర్తి జాతరకు పక్కా ఏర్పాట్లు: కలెక్టర్



గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకురుమూర్తి స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. కురుమూర్తి స్వామి జాతర మైదానంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 31 నుంచి నవంబరు 18 వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉద్దాల రోజున 3 లక్షల మంది భక్తులొచ్చే అవకాశం ఉందని భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు సరిపడా బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. జాతర మైదానంలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు సేవలందేలా చూడాలన్నారు. 24 గంటలూ విద్యుత్తు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామపంచాయతీలు, పురపాలికల నుంచి సిబ్బందిని కేటాయించాలన్నారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పార్కింగ్, బారికేడింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. జాతరలో మద్యం విక్రయాలు జరగకుండా ఆబ్కారీ అధికారులు చూడాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు, మహిళలకు షీటీంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆలయ ఛైర్మన్ గోవర్ధన్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పద్మ, ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీపీవో పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానవపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన ఎరుకలి రవి నుంచి 16 క్వింటాళ్లు, పెద్దపోతులపాడు గ్రామంలో కాసీం నుంచి 7 క్వింటాళ్ల బియ్యాన్ని వనపర్తి జిల్లాలోని పెబ్బేరుకు చెందిన విజయ్, కృష్ణయ్య, ఇటిక్యాల మండలంలోని కొండేరుకు చెందిన వెంకటరాముడు, శివ కొనుగోలు చేసి అశోక్ లే ల్యాండ్ ఆటోలో పెబ్బేరుకు తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించామన్నారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు పైఆరు మందితో పాటు ఆటో డ్రైవర్ సురేందర్‌పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బోయపల్లి యువకుడి సైకిల్‌యాత్ర



మహబూబ్‌నగర్ సాంస్కృతికం, మహమ్మదాబాద్ : సనాతన ధర్మ పరిరక్షణ ఆవశ్యకత వివరించేందుకు మహబూబ్‌నగర్ పట్టణ సమీపం బోయపల్లికి చెందిన యువకుడు మల్లేశ్‌గౌడ్ సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. గురువారం బోయపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో పూజల తర్వాత యాత్ర ప్రారంభించారు. మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ సనాతన ధర్మ ఔన్నత్యం, దాని పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ రోజూ 100 కి.మీ.లు సైకిల్‌యాత్ర చేసి స్థానిక ఆలయాల్లో బస చేస్తానని తెలిపారు. ఏడాది పాటు కొనసాగే ఈ యాత్రలో భాగంగా దేశంలోని 12 జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్‌ను అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, స్థానిక వివిధ యువజన సంఘాలు, ఆలయ కమిటీల ప్రతినిధులు సన్మానించారు. మహమ్మదాబాద్ శివారులో హిందూ వాహిని సభ్యులు శ్రీనివాస్, రఘు, రాకేశ్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు.

కనుల పండువగా కల్యాణం



మంగళసూత్రాలు చూపిస్తున్న పురోహితులు

మల్దకల్, న్యూస్‌టుడే: ఆశ్వీయుజమాసం గురువారం పౌర్ణమి సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిశిలావాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, పవమాన హోమం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఊంజలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు, అశోక్‌కుమార్, ముకుందరావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను కల్యాణానికి తెస్తున్న పూజారులు

ఇంటి నుంచి బయటకెళ్లి.. చెరువులో శవమై..




కిశోర్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువకుడు సరూర్‌నగర్ చెరువులో శవమై కనిపించిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన కాట్రమోని కిశోర్‌కుమార్ (34) తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కొంత కాలంగా నగరంలోని నందనవనంలో నివసిస్తున్నారు. కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో కూలీ పనులు మానేశాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగిరాలేదు. గురువారం చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి పడి ఒకరు మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మర్కల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్(19) హైదరాబాద్‌లోని చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతల్లో చేపలను విక్రయించడానికి నిత్యం ఆటోలో వెళ్లేవాడు. ఈ క్రమంలోనే చేవెళ్ల మార్కెట్లో చేపలు అమ్మేందుకు మరో ముగ్గురితో కలిసి బయల్దేరాడు. కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒకవైపు ఒరగడంతో అందులో నుంచి శంకర్, రాములు రోడ్డుపై పడిపోయారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి బలవన్మరణం



వీరశేఖర్ (పాత చిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: మనోవేదనతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. గద్వాల పుర పరిధిలోని నల్లకుంటకు చెందిన వీరశేఖర్ (50) ఎర్రవల్లి మండలం కోదండాపురం జడ్పీహెచ్ఎస్‌లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా మనోవేదనతో బాధపడుతున్న అతడు తన బాధను కుటుంబ సభ్యులకు వివరించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. అయినప్పటికీ గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికెళ్లిన ఆయన గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలోని రెండో రైల్వే గేటు(ఆర్వోబీ) వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరశేఖర్‌కు భార్య మంజులాబాయి(తెలుగు పండిట్), కుమార్తెలు విజ్ఞత (18), వినూత్న(15) ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

కుటుంబ సభ్యుల చెంతకు చేరిన యువకుడు



కుటుంబ సభ్యులకు చరణ్ (కుడినుంచి మూడో వ్యక్తి)ను అప్పగిస్తున్న ఎస్సై మంజునాథరెడ్డి, యువకులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రెండేళ్ల కిందట అదృశ్యమైన ఓ యువకుడు సామాజిక మాధ్యమం ద్వారా కుటుంబసభ్యుల చెంతకు చేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన రాములుకు కుమారుడు చరణ్ (20), ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవారు. రెండేళ్ల క్రితం రాములు ఇల్లు కూలిపోయింది. సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి సామగ్రి తరలించే క్రమంలో కుమారుడు కనిపించకుండా పోయారు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చరణ్ ఎక్కడెక్కడో తిరుగుతూ వారం క్రితం కొత్తకోటకు చేరారు. ఇక్కడ ఉన్న యువకులు విష్ణువర్ధన్, రఘు, శ్రీకాంత్‌తో అతను చనువుగా ఉండటంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌ను చూస్తూ పాటలకు నృత్యాలు చేసేవారు. అతని పేరిట వారు ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరచి అతను చేసిన నృత్యాల వీడియోలు పోస్టు చేశారు. వాటిని 14 లక్షలకు పైగా మంది వీక్షించారు. రాములు కుటుంబసభ్యులు చూసి కొత్తకోట యువకులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. వీడియో కాల్ చేయడంతో చరణ్ తన తండ్రి, అక్కలను గుర్తు పట్టారు. గురువారం కొత్తకోట పోలీసు స్టేషన్‌కు చేరుకున్న రాములుకు చరణ్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు. యువకుడిని కన్నవారి చెంతకు చేర్చిన యువకులను ఆయన అభినందించారు.

న్యూస్‌టుడే, కందనూలు

పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. రక్షణ కంచెలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు తొలగించాలి. - నవీన్‌కుమార్

నియంత్రిక వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. - గోపాల్‌రెడ్డి, విద్యుత్తుశాఖ ఏఈ, నాగర్‌కర్నూల్

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో... రవి : దేవర
రమణ : వేట్టయన్ దహంటర్
కల్వకుర్తిలో... పార్థసారథి : దేవర
అశోక్ : వేట్టయన్ దహంటర్

కూరగాయల ధరలు కిలో... రూ.లలో

కందనూలు, న్యూస్‌టుడే: టమాట 60, వంకాయ 45, బెండ 45, మిరప 50, కాకర 64, బీర 64, క్యాలీఫ్లవర్ 74, క్యాబేజీ 48, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 45, గోకర 64, దోస 44, ఆనగకాయ 18, పాలకూర 65, మునగకాయ 74, బీట్‌రూట్ 50, బీర 45, బీన్స్ 95.


నవగ్రహాలకు పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ రాజవీధిలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల నుంచి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయంలో నంది, శివుడు, పార్వతీ, నవగ్రహాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పురపాలక అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి, మాజీ సర్పంచి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో 119.0 మి.మీ వర్షం

కొల్లాపూర్, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని 4 మండలాల్లో 119.0 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైనట్లు ఏఎస్‌వో నరేందర్ గురువారం తెలిపారు. కొల్లాపూర్ మండలంలో 47.0 మి.మీ, పెంట్లవెల్లిలో 37.0 మి.మీ, కోడేరులో 19.6 మి.మీ, పెద్దకొత్తపల్లి మండలంలో 16.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. సాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో చిన్న హుస్సేన్ యాదవ్ సూచించారు.

చారకొండ ఎస్సై బదిలీ

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: చారకొండ ఎస్సై జి.వెంకట్‌రెడ్డి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆగస్టు 19న ఇక్కడ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డి రెండు నెలలకే ఉప్పునుంతల మండలానికి బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ ఎస్సైగా పనిచేస్తున్న శంషుద్దీన్ చారకొండ ఎస్సైగా రానున్నట్లు తెలిసింది.

ప్రతి ఇంటికి శుద్ధజలాలు సరఫరా చేయాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటి శుద్ధజలాలు సరఫరా చేయాలని మిషన్ భగీరథ మండల ఏఈ శివరాజ్ అన్నారు. దాసుపల్లి రైతు వేదికలో గురువారం మండల వ్యాప్తంగా తాగునీటి సరఫరా చేస్తున్న గ్రామ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తూనే కలుషితాలు నివారించాలన్నారు. తాగునీటి పైపు లైన్‌లు లీకేజీలు ఏర్పడితే తీసుకోవాల్సిన తక్షణ చర్యలు వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, మెకానిక్ శంకర్, సహాయకులు పాల్గొన్నారు.

కందనూలు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రజలు మిషన్ భగీరథ నీటిని తాగాలని ఎంపీడీవో కోటేశ్వర్ అన్నారు. మండలంలోని చందాయిపల్లి రైతు వేదికలో గురువారం గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి సహాయకులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ లీకేజీలను అరికట్టాలన్నారు. మిషన్ భగీరథ శాఖ అధికారులు జిలానీ, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి క్షేత్ర సహాయకుడి తొలగింపు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన క్షేత్ర సహాయకుడిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చిన్న ఓబులేశు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జులై నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీలో మండలంలోని బాణాల క్షేత్ర సహాయకుడు రాజేష్ రూ.74,778ను అవకతవకలు చేసినట్లు గుర్తించారని చెప్పారు. ఉన్నతాధికారుల తాఖీదులకు ఎలాంటి స్పందన లేకపోవడంతో తాత్కాలికంగా విధుల నుంచి తప్పించినట్లు వివరించారు.

కొల్లాపూర్ ఆర్టీసీ డిపో ఆదాయం రూ.2 కోట్లు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ ఆర్టీసీ డిపోనకు ఈనెల 1 నుంచి 16వ తేదీ వరకు 137 ప్రత్యేక బస్సులు నడిపించడంతో రూ.2.65 కోట్ల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ ఉమాశంకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వివిధ మార్గాల్లో 4.21 లక్షల కిలోమీటర్లు నడిపించి 5.60 లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.


పెంట్లవెల్లి: వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


అచ్చంపేట: వాల్మీకి చిత్రపటం వద్ద బోయలు


కొల్లాపూర్‌లో పుర అధ్యక్షురాలు రమ్యకుమారి..

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

న్యూస్‌టుడే బృందం : జిల్లాలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని గురువారం మండలంలోని కొండూర్, మల్లేశ్వరం గ్రామాల్లో నిర్వహించారు. కొండూర్ గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతురి ధర్మతేజ, సింగిల్‌విండో ఛైర్మన్ విజయ రామారావు పాల్గొన్నారు. ● అచ్చంపేటలో వాల్మీకి చిత్రపటం వద్ద బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనిగ మల్లేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. తిరుపతయ్య, పర్వతాలు, ఖాజా, రామనాథం, మధు తదితరులు పాల్గొన్నారు. ● కొల్లాపూర్‌లో పుర అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ● లింగాలలో ర్యాలీ నిర్వహించారు. ● కోడేరు మండలం ఎత్తంలో వాల్మీకి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు.

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం తిమ్మాజిపేటలోని వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వాల్మీకి విగ్రహానికి అభిషేకాలు చేసి పూజలు చేశారు. అనంతరం అన్నదానం, భారీ ర్యాలీ చేపట్టారు. వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఊర్కొండ, న్యూస్‌టుడే: వాల్మీకి సేవా స్ఫూర్తితో ముందుకు సాగుదామని వాల్మీకి సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో కల్వకుర్తి- జడ్చర్ల జాతీయ రహదారి వద్ద వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాచాలపల్లి గ్రామంలో వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించారు. నర్సింహ్మ, శేఖర్, శివ, సందీప్, ప్రశాంత్, శ్రీకాంత్, అభిషేక్, హరీష్ పాల్గొన్నారు.


లింగాలలో...


తిమ్మాజిపేటలో ర్యాలీ...


ఊర్కొండలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోళ్ల (ట్రేడర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 18 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం వరకు ఉండాలని అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ కార్డు ప్రమాణికమన్నారు. ఈ ఏడాది పత్తికి మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలో 218841 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నవంబరు మొదటి వారం నుంచి అధికంగా కేంద్రాలకు పత్తి వస్తుందన్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ సర్దార్ సర్వానాయక్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల గుర్తింపు ప్రణాళికలు రూపొందించండి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లాలో విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు మౌలిక వసతుల సదుపాయాల కోసం వివరాలను అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ శాఖలు తమ నిర్వహణలో ఉన్న వసతి గృహాలు, పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, క్రీడా వసతులు, ప్రహరీలు, విద్యార్థులకు కావాల్సిన వసతులను గుర్తించాలన్నారు. ఆర్‌ఓ ప్లాంటు, తరగతి గదుల అవసరం, వాటికి అయ్యే ఖర్చును పొందుపరచాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు పీహెచ్‌సీలలో కావాల్సిన వసతులను గుర్తించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ నెల 18న సమగ్ర నివేదికలు అందించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. భ్రూణ హత్యలను నివారించి ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మానవాళికి మార్గదర్శి భగవద్గీత

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : భగవద్గీత మానవాళికి మార్గదర్శనం చేస్తుందని, పిల్లలు చిన్న వయసు నుంచే గీత చదివితే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తితిదే ఉమ్మడి జిల్లా బాధ్యుడు డా.ఉత్తరపల్లి రామాచారి అన్నారు. తితిదే, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో 'మన వలంటరీ భగవద్గీత' పేరుతో ముద్రించిన పుస్తకాన్ని గురువారం మహబూబ్‌నగర్‌లోని తితిదే కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాచారి మాట్లాడుతూ భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. డా.విభీషణ శర్మ ప్రత్యేకంగా విద్యార్థుల కోసం శ్లోకం, భావంతో కూడిన వచన పుస్తకాన్ని రూపొందించారని, వాటిని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. పుస్తకాలు కావాల్సిన ప్రధానోపాధ్యాయులు తితిదే కల్యాణ మండపంలో శుక్ర, శనివారాల్లో సంప్రదించాలని రామాచారి సూచించారు. ధార్మిక కమిటీ సభ్యులు కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భగవద్గీత ప్రతి హిందూ కుటుంబం వద్ద తప్పకుండా ఉండాల్సిన పవిత్రమైన గ్రంథమన్నారు. ధర్మాచార్యులు ఎం.రఘు సంక్షిప్త భగవద్గీత పుస్తకాన్ని సమీక్ష చేశారు. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు సురేందర్‌చారి, బి.రాములు, దామోదర్‌రెడ్డి, నరేష్, ఎం.శ్రీరాములు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సంక్షిప్త భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఉమ్మడి జిల్లా బాధ్యుడు డా.ఉత్తరపల్లి రామాచారి తదితరులు

రైతు సంక్షేమానికి పెద్దపీట

వంగూరు, న్యూస్‌టుడే : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మండలంలోని రంగాపూర్ సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వాల్మీకి జయంతి సందర్భంగా వంగూరు, ఉల్లంపల్లి, వెలమలపల్లి తదితర గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా చోట్ల మాట్లాడుతూ.. వరి క్వింటాలుకు రూ.2320 ప్రభుత్వ మద్దతు ధర ఉందని, వెంటనే ఖాతాల్లో డబ్బులు పడతాయని చెప్పారు. రంగాపూర్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతు రుణమేళా నిర్వహించి రుణాలు ఇప్పించాలని సిబ్బందికి సూచించారు. ఉల్లంపల్లి నుంచి వంగూరు వరకు తారు రోడ్డు మంజూరు చేయించి, అంతర్గత సీసీ రోడ్లు వేయిస్తానన్నారు. ఉల్లంపల్లిలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. రంగాపూర్ సింగిల్‌విండో ఛైర్మన్ కుమ్మేలు సురేందర్‌రెడ్డి, సీఈవో విష్ణుమూర్తి, చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, సురేశ్గౌడ్, భైరెడ్డి పాండురంగారెడ్డి, శంకర్‌యాదవ్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.


రంగాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మత్స్యకారుడిని కాపాడిన పోలీసులు

పెంట్లవెల్లి, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకుంటున్న 100కి ఫోన్‌చేసిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఎస్సై రామన్‌గౌడ్ కథనం ప్రకారం.. పెంట్లవెల్లి మండలం కృష్ణానది తీరంలో చేపలు పట్టడానికి రెండు నెలల క్రితం వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుత్తా రుదు అన్నయ్య జిల్లాకు చెందిన షేక్ షానవాజ్ మద్యానికి బానిసయ్యాడు. మానసిక ఒత్తిడికి గురవుతూ కృష్ణానది తీరంలో తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. డయల్ 100కు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గుత్తాదారుని పిలిచి అప్పగించినట్లు ఎస్సై వెంకటేష్, రాజేష్ తెలిపారు.


బాధితుడితో మాట్లాడుతున్న ఎస్సై రామన్‌గౌడ్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే: వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి గ్రామానికి తారు రహదారిని ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల తిమ్మినోనిపల్లి గ్రామంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే జనార్దన్ నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గాను ఎమ్మెల్యే నారాయణరెడ్డి సిఫారసు మేరకు బొంగోనిపల్లి ఆర్అండ్‌బీ (ర.భ) రోడ్డు నుంచి తిమ్మినోనిపల్లి వయా రామారేకంటం వరకు 4.50 కిలోమీటర్ల కొత్తగా తారు రహదారి నిర్మాణానికి రూ.2.25 కోట్లు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రాంచంద్రారెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నర్సింహ, శేఖర్‌రెడ్డి, శోభన్‌బాబు, జైపాల్‌రెడ్డి, వెంకటయ్య, రాంజీ వెంకట్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉమామహేశ్వరంలో జలపాతం వద్ద పర్యాటకుల సందడి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతాలు జాలువారుతున్నాయి. గురువారం మధ్యాహ్నం భక్తులు, పర్యాటకులు జలపాతాల వద్ద సందడి చేశారు. నీటిలో తడుస్తూ, స్వీయ చిత్రాలు తీసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో భాగంగా అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పెద్దకొత్తపల్లిలో గ్రామ కార్యదర్శి నాగేష్ ఆధ్వర్యంలో పరిశీలన జరిపారు. పరిశీలన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు.

19న పీటీఎం

అచ్చంపేట, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని సర్కారు బడుల్లో ఈనెల 19న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహించాలని డీఈవో డా.గోవిందరాజులు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో తల్లిదండ్రులు భాగస్వామ్యమయ్యేలా ఎంఈవోలు, హెచ్ఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.




కుమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడి.. కొల్లాపూర్: నార్లాపూర్ గిరిజన సంక్షేమ పాఠశాలలో.. అచ్చంపేట: సిద్దాపూర్‌లో...

కుమురం భీం స్ఫూర్తితో పోరాడాలి

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఆదివాసీలపై నిజాం ప్రభుత్వం సాగించిన దోపిడి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వీరుడు కుమురం భీం అని ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడి అన్నారు. మండలంలోని మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో గురువారం కుమురం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీలు సామాజిక రుగ్మతలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ మేనేజరు జాఫర్ హుస్సేన్, ఉప విద్యాధికారి శంకర్, కార్యాలయ సిబ్బంది, ఆదివాసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని నార్లాపూర్ గిరిజన సంక్షేమ పాఠశాలలో కుమురం భీం చిత్రపటానికి నివాళి అర్పించారు. అధ్యాపకురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గిరిజనులు పాల్గొన్నారు.

అచ్చంపేట : అచ్చంపేట మండలం సిద్దాపూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం కుమురం భీం చిత్రపటానికి నివాళి అర్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడుగా బిజ్జ దేవదాస్, కన్వీనర్లుగా బండి శ్రీను, మద్దెల రామదాసు, బిజ్జ వేణులను గురువారం ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ చెన్నయ్య తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల ఆత్మగౌరవ సభ గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో కలమంద చెన్నయ్య, అవుట చెన్నయ్య, రమేష్, రామచంద్ర, శంకరయ్య పాల్గొన్నారు.


గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు


అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

అచ్చంపేట టౌన్, న్యూస్‌టుడే : విద్యార్థుల పెండింగ్ ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో కలిసి నిరసన తెలిపారు. బకాయిలను విడుదల చేయకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సుల్తాన్, సౌటకాశీం, వెంకటేష్, బాలు, మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలు దెబ్బతినకుండా చర్యలు: డీఈ

వెల్దండ, న్యూస్‌టుడే: కాల్వల పనులు పూర్తి చేసి పంటలు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని మైనర్ ఇరిగేషన్ డీఈ సమ్మయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని డి-82 కాల్వను పరిశీలించారు. పిల్ల కాల్వల వెంట నీరు వెళ్లకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. అసంపూర్తిగా ఉన్న కాల్వ పనులు పూర్తి చేసి పంటలు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. రైతులు తగుళ్ల కొండల్‌యాదవ్, బాలస్వామి, శ్రీశైలం తదితరులున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు.. ఉప్పునుంతల, న్యూస్‌టుడే : శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై పిరట్వాన్‌పల్లి గేట్ వద్ద గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. లింగాల మండలం కోమటికుంటకు చెందిన మైబు తన ద్విచక్ర వాహనంపై నల్గొండ జిల్లా డిండి వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ ముంగీస వచ్చి వాహనం చక్రాలకు చిక్కుకోగా అదుపు తప్పి కింద పడ్డారు. 108 వాహనంలో అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోతులదాడిలో మహిళకు గాయాలు.. తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: తిమ్మాజిపేటకు చెందిన లక్ష్మమ్మ అనే మహిళపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం సమయంలో ఇంటి ముందు నిల్చున్న మహిళపై ఒక్కసారిగా కోతులు దాడి చేశాయి. చుట్టూ పక్కల వారు గుర్తించి తరిమివేశారు. తల, చేతులకు గాయాలు కాగా వెంటనే జడ్చర్ల అక్కడ నుంచి మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. కోతుల బెడద పెరిగిందని, ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయంగా ఉందంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. ఉప్పునుంతల, న్యూస్‌టుడే : దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఏఎస్సై రెడ్యానాయక్ తెలిపారు. కాంసానిపల్లి, హాజీపూర్ కూడలి వద్ద పట్టుకొని మొల్గరకు చెందిన డ్రైవర్ పి.రాజుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వర్షానికి కూలిన ఇల్లు.. పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని యాపట్లలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి శ్రీరాములు ఇల్లు కూలిపోయింది. కుటుంబ సభ్యులు ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రూ.2లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు.


సంఘటనా స్థలంలో గ్రామస్థులు

లక్కీ డ్రా నిందితుల రిమాండ్.. చిన్నంబావి, న్యూస్‌టుడే: మండలంలో లక్కీ డ్రా స్కీం పేరిట ప్రజలను మోసం చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. చిన్నంబావి మాజీ సర్పంచి రంజిత్‌తో పాటు, మండలంలోని వెలటూరుకు చెందిన తిరుమలేశ్, అయ్యవారిపల్లికి చెందిన ఖాదర్, కొల్లాపూర్ మండలం కుడికిళ్ల, సోమశిలకు చెందిన లక్ష్మణ్, నిరంజన్‌ను రిమాండ్ చేశామని పేర్కొన్నారు. మొత్తం రూ.63 లక్షలు మోసం జరిగిందని, 432 మంది బాధితులు ఉన్నట్లు వివరించారు.

అత్యాచారయత్నం కేసులో.. బిజినేపల్లి, న్యూస్‌టుడే: వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై తిరుపాల్ అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడి బంగారు ఆభరణాలు లాక్కొని, అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఘటనపై ఈనెల 9న నిందితుడిపై కేసు నమోదయింది. నిందితుడిని గురువారం జిల్లా కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఏఎస్సై తెలిపారు.

యువతిని వేధించిన యువకుడికి.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : ప్రేమ పేరుతో యువతిని వేధించిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన ఎల్లికంటి నిరంజన్ ఏడాదిగా ఓ యువతిని వేధిస్తున్నాడని చెప్పారు. యువతి ఫిర్యాదు మేరకు ఇది వరకే కేసు నమోదైన యువకుడికి గురువారం పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి విజయ్‌కుమార్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. కల్వకుర్తి కారాగారానికి తరలించినట్లు వివరించారు.

జూదమాడిన ఐదుగురిపై కేసు.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : జూదం ఆడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఉట్లకోనేరు సమీపంలో ఓ దుకాణంలో జూదం ఆడుతున్న ఐదు మంది వద్ద రూ.7400, 5 చరవాణులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

లభించని వ్యక్తి ఆచూకీ.. అమ్రాబాద్, న్యూస్‌టుడే : శ్రీశైలం ప్రధాన రహదారిపై అదృశ్యమైన దేవరకొండ మండలం శేరిపల్లికి చెందిన మోడం ఈదయ్య ఆచూకీ లభించలేదని ఎఫ్ఎస్‌వో ప్రశాంత్ రెడ్డి తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీసీ ఫుటేజీలు, కాల్ డేటా పరిశీలించామని, ఆసుపత్రుల్లో విచారణ చేశామని ఎస్సై ఖాద్రి చెప్పారు. గ్రామస్థుల సహకారంతో అటవీ ప్రాంతంలో గాలింపు నిర్వహించామని వివరించారు.

బీమా చెక్కు అందజేత

బిజినేపల్లి, న్యూస్‌టుడే: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న ప్రమాద బీమాతో బాధిత కుటుంబాలకు భరోసా అందుతుందని తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు రవికుమార్, తపాలా బ్యాంకు రీజినల్ మేనేజర్ భాస్కర్‌నాయక్ అన్నారు. గురువారం బిజినేపల్లి మండలం మహాదేవుని పేటలో బాధిత కుటుంబానికి బీమా పరిహారం చెక్కును అందజేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కరుణాకర్ అనే వ్యక్తి గతంలో రూ.799తో బీమా చెల్లించడం ద్వారా, తన మరణానంతరం రూ.15లక్షలు తన కుటుంబ సభ్యులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య బిర్లా బీమా కంపెనీ ప్రతినిధి రమేష్, నాగర్‌కర్నూల్ తపాలా బ్యాంకు మేనేజర్ యశస్వి ప్రసాద్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న తపాలా అధికారులు

హక్కుల సాధనకు ఉద్యమించాలి

కందనూలు, న్యూస్‌టుడే: మహిళలు తమ హక్కులు సాధించుకోవడానికి ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత అన్నారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న రాజ్యాంగంలో కల్పించిన హక్కులు మాత్రం అమలు కావడం లేదని విమర్శించారు. అనంతరం రాష్ట్ర మహాసభల గోడపత్రిక విడుదల చేశారు. సమావేశంలో మహిళ నాయకులు జయలక్ష్మి, విజయ, లక్ష్మి పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో చేపడుతున్న సీసీ రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పుర అధ్యక్షుడు ఎడ్మ సత్యం అన్నారు. గురువారం 1, 21వ వార్డులో చేపడుతున్న పనులను ఏఈ షబ్బీర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి గడువు లోపు పనులు పూర్తిచేయాలన్నారు. ఉపాధ్యక్షుడు షాహెద్, కౌన్సిలర్లు సైదులుగౌడ్, బాలునాయక్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. గురువారం అచ్చంపేటలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రగతిపై నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ, సభ్యత్వ నమోదు జిల్లా సహ ఇన్‌చార్జి సైదులు యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి, భాజపా జిల్లా కార్యదర్శి శ్రీనునాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

వంగూరు, న్యూస్‌టుడే : రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో నాయకులు అల్లె భీమయ్య, రామకృష్ణారెడ్డి, సిల్వేరు సైదులు, నవీన్‌రెడ్డి, యాదయ్య, సైదులు, కృష్ణ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను పంపించాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే : జులైలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వారికి కేటాయించిన స్థానాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి అన్నారు. కొరత ఏర్పడిన పాఠశాలల్లో పని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు.